
సాక్షి
పల్నాడు
గురువారం । 7 । ఆగస్టు । 2025



ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బాపట్ల అర్బన్: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీసీ సంక్షేమశాఖ డీడీ శివలీల పేర్కొన్నారు. ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను బుధవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 587.70 అడుగులకు చేరింది. ఇది 305.9222 టీఎంసీలకు సమానం.



కొండలమ్మ ఆదాయం రూ.17.75 లక్షలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మవారి దేవస్థానంలో హుండీల్లోని కానుకలను బుధవారం లెక్కించగా రూ.17,75,841 వచ్చాయి.

న్యూస్‌రీల్

పారిశుద్ధ్య నిర్వహణలో భాగస్వామ్యం

జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్‌నాయక్



సత్తెనపల్లి: జిల్లాలోని ప్రతి గ్రామం పారిశుద్ధ్యంలో ఉన్నత ప్రమాణాలు అందుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్‌వీ నాగేశ్వర్‌నాయక్ అన్నారు. సత్తెనపల్లి మండలం సుప్రీం ఎల్‌టీసీ నందిగామలో బుధవారం గృహ స్థాయిలో పొడి, తడి చెత్త వేరు చేయడంపై ఒకరోజు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌నాయక్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌శాఖ సూచనల మేరకు అందరు అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శిక్షణలో భాగంగా ముందుగా అందరు ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలను 8 మంది హరిత రాయబారులతో కలిపి బృందాలుగా విభజించి గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. డీఎల్‌డీఓలు రాజగోపాల్, గబ్రు నాయక్, డీఎల్‌పీఓ లక్ష్మణ్ రావు, సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ షేక్ అజీజుర్ రెహ్మాన్, సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, పల్నాడు డీఆర్‌పీ నరసింహ నాయక్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి మేలు

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి




బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయడం వలన భూమికి మేలు జరుగుతుందని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. బుధవారం వ్యవసాయ, ఉద్యానవనశాఖల సిబ్బందికి, ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మండలంలోని బెల్లంకొండ రైతు సేవ కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అనుబంధ శాఖ అయిన ప్రకృతి వ్యవసాయాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లేందుకు సిబ్బంది కలిసి పని చేయాలని అన్నారు. ఏ గ్రేడ్ మోడల్‌లో సాగు చేసుకునే విధానాల గురించి తెలియజేశారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలోని నరసింహారావు ఎన్‌పీఎం షాపును దర్శించారు. బెల్లంకొండ ఏఓ అరుణ కుమారి, రాజుపాలెం ఏఓ వెంకట నరసయ్య, క్రోసూరు డివిజన్ ఎంటీ జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంగళగిరిలో సీఎం పర్యటన



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో ఉన్న వీవర్స్ శాల వద్ద జరుగనున్న జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వీవర్స్ శాల ఎదురుగా ఏర్పాటు చేయనున్న ప్రజావేదిక వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. సంయుక్త కలెక్టర్ భార్గవతేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎఫ్‌ఓ కృష్ణారెడ్డి, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ జేడీ రాజారావు, మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పశ్చిమ డెల్టాకు 8,004 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,004 క్యూసెక్కులు బుధవారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్ కాలువకు 300, బ్యాంక్ కెనాల్‌కు 1,917, తూర్పు కాలువకు 722 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అన్నదాతకు వెన్నుపోటు

అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20వేలు ఇస్తామని ఊరూరా, ఇంటింటా ఊదరగొట్టారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన అన్నదాతలు సాయమేదని ప్రశ్నిస్తే.. ఇదిగో అదిగో అంటూ ఏడాది గడిపారు. ఇప్పుడు తీరా రూ.5వేలు మాత్రమే అందించి చేతులు దులుపుకొన్నారు. ఆంక్షలు పెడుతూ వేలాది మందిని పథకానికి దూరం పెట్టారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా అందుకున్నవారిలో సుమారు 40వేల మంది రైతులను కూటమి సర్కారు ఈ పథకానికి దూరం చేయగా.. సుఖీభవ అందుకున్న 35వేల మందికి పైగా రైతులకు పీఎం కిసాన్ నగదు జమ కాకపోవడంపై అన్నదాతల్లో విస్మయం వ్యక్తమవుతోంది.



- ఏటా రూ.20వేలు ఇస్తామంటూ కూటమి నేతల హామీ
- తీరా అరకొర విదిలింపులు.. లబ్ధిదారుల సంఖ్యలో కోతలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో పోల్చితే 40వేల మందికి పైగా తగ్గుదల
- పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల్లోనూ వ్యత్యాసం
- జిల్లావ్యాప్తంగా 35,792 మందికి అందని పీఎం కిసాన్ నగదు
- సుమారు 5వేల మందికి అందని 'సుఖీభవ'
- ఒక జాబితాలో ఉన్న రైతుకు మరో జాబితాలో లేని చోటు
- జిల్లాలో కొందరికి రూ.5 వేలు పడగా, మరికొందరికి రూ.2 వేలే జమ
- ఈకేవైసీ, మ్యాపింగ్ పేరుతో అనర్హులుగా రైతులు
- ఇచ్చిన మాట ప్రకారం రూ.20 వేలు జమ చేయాల్సిందేనంటున్న రైతులు

సాక్షి, నరసరావుపేట: అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేశామని కూటమి ప్రభుత్వం డప్పుకొడుతుండగా, మరోవైపు రైతులు మాత్రం అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. అన్ని అర్హతలుండి కొందరికి అన్నదాత సుఖీభవ నగదు జమకాలేదు. మరికొందరికి అయితే రూ.5 వేలు, రూ.2 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమయ్యాయి. దీంతో రైతులు తీవ్ర అయోమయంలో ఉన్నారు. పీఎం కిసాన్ నిధులు ఎందుకు పడలేదో చెప్పేవారు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా 2.80 లక్షల మందికి పెట్టుబడి సాయం అందించారు. అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు తొలి ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రెండో ఏడాది అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలను రాష్ట్ర ప్రభుత్వం, పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలను ఖాతాలలో జమ చేశామని ఈ నెల 2వ తేదీన ప్రకటించారు. ఇందులో అన్నదాత సుఖీభవ పథకానికి 2,40,530 మంది అర్హులని అధికారులు ప్రకటించారు. గత ప్రభుత్వం ఇచ్చిన దానికన్నా 40 వేల మంది ఇందులో తగ్గారు.



అరకొరగా 'సుఖీభవ'..అన్నదాత దుఃఖీభవ!

పీఎం కిసాన్ మాత్రమే..

ఈకేవైసీ, 1బీ మ్యూటేషన్ కాలేదని, ఫ్యామిలీ మ్యాపింగ్ అంటూ వివిధ కారణాలతో గత ప్రభుత్వంతో పోల్చితే లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. పోని వీరికైనా రూ.7 వేలు జమ అయ్యాయా అంటే అది లేదు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా జిల్లాలో కేవలం 2,04,738 మందే అర్హత సాధించారు. వీరికే కేంద్రం ఇస్తున్న రూ.2 వేలు జమ అయ్యాయి. 35,792 మంది రైతులు అన్నదాత సుఖీభవ పొంది పీఎం కిసాన్‌కు దూరమయ్యారు.

సుఖీభవకు మంగళం

ఇదిలా ఉండగా పీఎం కిసాన్ నగదు పొంది అన్నదాత సుఖీభవకు సుమారు 5వేల మంది రైతులు దూరమయ్యారు. పీఎం కిసాన్‌లో రూ.2వేలు జమకాగా అన్నదాత సుఖీభవ కింద రాష్ట్రం ఇవ్వాల్సిన రూ.5 వేలు వీరికి జమ కాలేదు. దీంతో రైతుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. పీఎం కిసాన్‌కు అర్హత సాధించిన రైతు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవకు ఎలా అనర్హుడవుతాడని రైతులు ప్రశ్నిస్తున్నారు. కూటమి నేతలు అధికారంలోకి రాగానే రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పారని ఆమాటకు కట్టుబడి వివిధ జాబితాలు, ఈ–కేవైసీలు అని సాకులు చెప్పకుండా అర్హతున్న రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కౌలు రైతులకు కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామన్నారని, ఇప్పటివరకు కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీలో ముందడుగు వేయలేదని విమర్శిస్తున్నారు.

రూ.2 వేలు మాత్రమే వచ్చాయి



పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.2 వేలు మాత్రమే నా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అందజేయాల్సిన రూ.5వేలు అన్నదాత సుఖీభవ నిధులు జమ కాలేదు. పీఎం కిసాన్‌కు అర్హుడైన నేను అన్నదాత సుఖీభవకు ఎందుకు అర్హత సాధించలేదో అర్థం కావడం లేదు. కారణం ఏంటో చెప్పేవారు లేరు.

– దేవరకొండ పున్నారావు, రైతు, కంచరగుంట, దుర్గి మండలం

కేంద్రంతో సంబంధం లేకుండా రూ.20 వేలు ఇవ్వాలి



టీడీపీ నేతలు ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలను కేంద్రంతో సంబంధం లేకుండా ఇస్తామని చెప్పారు. తీరా గెలిచాక పీఎం కిసాన్‌తో కలిపి అంటున్నారు. ఇప్పుడేమో ఈ–కేవైసీ సాకుతో కొందరికి రూ.5 వేలు, మరికొందరికి రూ.2 వేలు జమ చేసి రైతులను మభ్యపెడుతున్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేంద్రాన్ని బూచి చూపకుండా నేరుగా రూ.20 వేలు రైతులకు జమ చేయాలి.

– ఏపూరి గోపాలరావు, ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి

రైతులను ప్రభుత్వం మోసం చేస్తోంది...



ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వివిధ కారణాలతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించింది. ఇప్పుడేమో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ అంటూ రెండు జాబితాలు తయారు చేసి అనర్హులను చేస్తోంది. ఒక పథకానికి అర్హత సాధించిన రైతు మరో పథకానికి అనర్హుడు ఎలా అవుతాడో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

– అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

కౌలు రైతులకు సుఖీభవ ఏదీ ?



అన్నదాత సుఖీభవ నిధులు వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పడటం లేదు. కేంద్ర ప్రభుత్వమేమో కౌలు రైతులకు పీఎం కిసాన్ ఇవ్వమంటుంది. రాష్ట్రప్రభుత్వం ఇస్తామంటున్నా ఇప్పటివరకు కౌలు రైతు కార్డుల మంజూరులో సమస్యలు తీర్చడంలేదు. దీంతో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ లేదు, పంటలు అమ్ముకోలేరు, బ్యాంక్ రుణాలు రావు.

–పెండ్యాల మహేష్, ఏపీ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు

ఖరీఫ్‌లో పొగాకు సాగు నిషేధం

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు


నరసరావుపేట రూరల్: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పొగాకు పంటను పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. కలెక్టరేట్ ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు రైతుల సమాయత్తంపై సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా వర్షపాతం నమోదు, సాధారణ పంట సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎరువుల లభ్యత, కౌలుదారు హక్కు పత్రాలు, కౌలు రైతులకు పంట రుణాల పంపిణీ తదితర కార్యక్రమాలపై జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రబీ కాలానికి వరి పంట సాగుకు సాగర్ నీరు విడుదల చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దీనిపై వ్యవసాయ అధికారులు గ్రామస్థాయికి వెళ్లి రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఆగస్టు నెలలో వివిధ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతున్నందున సరిపడా ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతి పదిరోజులకు ప్రైవేటు రిటైల్ డీలర్ షాపులను తనిఖీ చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపేలా రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం..

నరసరావుపేట రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య వేడుకల సన్నద్ధతపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వేడుకల్లో పాల్గొని జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపిస్తారని తెలిపారు. డీఆర్‌ఓ మురళి, అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఆర్‌డీఓ మధులత, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉద్యోగం లేదు.. బతకాలని లేదు'

- తల్లిదండ్రులకు ఫోన్ చేసి, అనంతరం రైలుకింద పడి మృతిచెందిన బ్రహ్మారెడ్డి
- హైదరాబాద్‌లో ఘటన.. మృతుడి స్వగ్రామం పెదగార్లపాడులో విషాదం



కామిరెడ్డి బ్రహ్మారెడ్డి (ఫైల్)

దాచేపల్లి: మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమారుడు బ్రహ్మారెడ్డి(25) బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. శ్రీనివాస రెడ్డి, భూలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సతీష్ రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా.. బీటెక్ పూర్తి చేసిన చిన్న కుమారుడు బ్రహ్మారెడ్డి హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనయ్యాడు. దీంతో బుధవారం తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఉద్యోగం సాధించలేకపోయానని.. తానిక బతకలేనని.. ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా తెలిపి ఫోన్ పెట్టేశాడు. కుటుంబ సభ్యులు అతనికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అనంతరం హైదరాబాద్ లింగంపల్లి సమీపంలో రైలు కిందపడి బ్రహ్మారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు మృతిచెందడంతో శ్రీనివాస్ రెడ్డి, భూలక్ష్మి బోరున విలపించారు. పోస్టుమార్టం పూర్తి కావడంతో బుధవారం రాత్రి బ్రహ్మారెడ్డి మృతదేహాన్ని స్వగ్రామమైన పెదగార్లపాడు తీసుకువచ్చారు.

నేటి నుంచి క్రీడా దినోత్సవ ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ క్రీడల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఈనెల 7, 8, 9 తేదీలలో నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి బుధవారం తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో భాగంగా ఈనెల 7వ తేదీన నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో ఖోఖో (కె.మనోహర్, 8309426350) ఎంపిక పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే 8వ తేదీన సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో అథ్లెటిక్స్, ఆర్చరీ, (ఎం.సైదారావు, 8019219224), బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకీ (సిహెచ్.శ్రీనివాసరావు 8143475010), కబడ్డీ (కె.మనోహర్), మాచర్లలో వెయిట్ లిఫ్టింగ్ (సిహెచ్.గోపి 9441947974) పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే 9వ తేదీన డీఎస్‌ఏ స్టేడియంలో బాడ్మింటన్, వాలీబాల్ పోటీలు జరుగుతాయని వివరించారు.

'చేనేత'కు అందని చేయూత

చేనేత వస్త్రాలు అంటే జాతీయ స్థాయిలో మంగళగిరికి పేరుంది. అగ్గి పెట్టెలో పట్టే చీరను తయారు చేసిన ఘనత మంగళగిరి నేతన్నలది. ఒకప్పుడు వెలుగు వెలిగిన చేనేత పరిశ్రమ నేడు సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు జిల్లాలో 80 వేలకుపైగా ఉన్న మగ్గాలు నేడు 35 వేలకు తగ్గిపోయాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకునేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టింది. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక నేత కార్మికులను గాలికి వదిలేసింది.



గుంట మగ్గం నేస్తున్న కార్మికుడు

- నాడు కార్మికులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి సర్కార్ వచ్చాక తప్పని అష్టకష్టాలు
- నేతన్నలను ఆదుకోవడంలో చంద్రబాబు అన్నివిధాలా విఫలం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి: నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి అంటే చేనేత గుర్తుకు వచ్చేలా ముఖద్వారంలో నేతన్న విగ్రహం ఏర్పాటు చేశారు. చేనేత సెంటర్‌గా పేరుపెట్టారు. విజయవాడ వైపు నుంచి వచ్చే వారికి మంగళగిరి అంటే చేనేత అని గుర్తుకు వచ్చేలా ప్రకాశం బ్యారేజి వద్ద నేతన్న విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతి కార్మికుడుకి నెలకు రూ.రెండు వేలు చొప్పున ఏటా రూ.24,000 నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,500 కుటుంబాలు చేనేతపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. నాడు రాజీవ్ గృహ కల్ప కాలనీ వద్ద చేనేత షెడ్లు నిర్మించారు. 146 మగ్గాలు ఉచితంగా అందజేసి సుమారు 1,500 కుటుంబాలకు ఉపాధి కల్పించారు. పాత బస్టాండ్ ప్రగడ కోటయ్య, వైఎస్సార్‌ల పేరిట ఆవరణలో చేనేత భవనాన్ని నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించింది. తెనాలి రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయే వారికి చేనేత భవన్‌లో దుకాణాలు కేటాయించేలా ప్రణాళిక రూపొందింది.

నేడు అంతటా నిర్లక్ష్యమే

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేనేత పరిశ్రమను పూర్తిగా విస్మరించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేత భవన్ కట్టిందనే కక్షతో నేటికీ ప్రారంభించలేదు. దీంతో నేత దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరిలో గెలిచి మంత్రి అయిన నారా లోకేష్ ఇప్పటికీ చేనేత పరిశ్రమను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ పరిశ్రమపై ఆధార పడి వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నా ప్రభుత్వం విస్మరించింది. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికుడు గుంట మగ్గంలో నేయడానికి కూలికి వెళ్తే రోజుకు రూ.250 మించి రావడం లేదు. వేసవికాలంలో రూ.150 కే ఈ మొత్తం పరిమితం. సుదీర్ఘ కాలం పనిచేస్తే అనారోగ్యం పాలవుతున్నారు.



ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెలకు రూ.2 వేలు సాయంగా ఇచ్చేవారు. ఆరోగ్యం సరిగా లేక పనికి పోలేకపోయినా పూట గడిచేది. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకాన్ని ఎత్తేయడంలో ఒక్క రోజు పనికి పోకున్నా పూటగడవని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కార్మికుల కుటుంబాలు సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవించేవి. ఇప్పుడు ఏ పూటకు ఆ పూట భయంగా బతకాల్సి వస్తోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– అడిగోపుల తారకేశ్వరి, చేనేత కార్మికురాలు

పూట గడవని దుస్థితిలో నేతన్నలు

చంద్రబాబు చేనేత పరిశ్రమకు, కార్మికులు మేలు చేస్తారని ఓటేశాం. మంత్రి లోకేష్ కూడా పట్టించుకోవడం లేదు. వైఎస్సార్ సీపీ పాలనలో నెలకు రూ.రెండు వేలు చొప్పున వచ్చేవి. బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అయ్యేవి. కార్మికులు సంతోషంగా జీవించేవారు. నేడు ఏ రోజుకా రోజు పని చేస్తేనే పూట గడిచే దుస్థితిలోఉన్నారు. ప్రభుత్వం స్పందించాలి.

– వెంకటేశ్వరరావు, చేనేత కార్మికుడు

చెట్టును ఢీకొన్న లారీ

- క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్, క్లీనర్
- క్షేమంగా బయటకు తీసిన పోలీసులు

నరసరావుపేట రూరల్: గేదెను తప్పించే ప్రయత్నంలో లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలైన ఘటన బుధవారం రాత్రి సత్తెనపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట పట్టణం నుంచి ఖాళీ లోడ్‌తో వెళ్తున్న లారీ సత్తెనపల్లిరోడ్డు రింగు రోడ్డు సమీపంలో గేదెను తప్పించే ప్రయత్నంలో చింత చెట్టును ఢీకొట్టింది. వేగంగా చెట్టును ఢీ కొట్టడంతో లారీ క్యాబిన్ భాగం దెబ్బతిని డ్రైవర్, క్లీనర్‌లు లారీలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ కిషోర్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రొక్లెయిన్ సాయంతో లారీని వెనక్కు లాగి క్యాబిన్‌లో ఉండిపోయిన ఇద్దరిని బయటకు తీసారు. గాయపడిన ఇరువురిని 108 అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించారు. ఇరువురి వివరాలు తెలియాల్సి ఉంది.



లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్, క్లీనర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు

రాష్ట్రస్థాయి జైళ్ల శాఖ కబడ్డీ పోటీలకు సబ్ జైలు సూపరింటెండెంట్ ఎంపిక


సూపరింటెండెంట్ కృష్ణారావు

వినుకొండ: వినుకొండ సబ్‌జైల్ సూపరింటెండెంట్ అమరా కృష్ణారావు జైళ్ల శాఖ రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 6వ తేదీన నెల్లూరులో జరిగిన శిక్షణా శిబిరంలో ప్రతిభ కనపరచిన ఆయన సెప్టెంబరు 9,10 తేదీల్లో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడనున్నారు. ఈసందర్భంగా సహచర ఉద్యోగులు సిబ్బంది కృష్ణారావును అభినందించారు.

9న మున్సిపల్ కార్యాలయాల ఎదుట టూల్‌డౌన్


సమావేశంలో పాల్గొన్న నాయకులు

మంగళగిరి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవో నంబరు 36పై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద టూల్‌డౌన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 36పై స్పష్టత ఇవ్వకపోవడం, అమలు చేయకపోవడంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు రత్నాకరం శ్రీనివాసరాజు, పట్టణ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు నక్క నాగరాజు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'విద్యా శక్తి'పై నిర్బంధం తగదు


డీఈఓ రేణుకకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించిన విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ కె.నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను కలిసిన నాయకులు తమ ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పలుచోట్ల విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అలసిపోయిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. వారి మానసిక, శారీరక పరిస్థితులను అర్థం చేసుకోకుండా ఇలా చేయడం తగదన్నారు. హెచ్‌ఎంలకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. డీఈవో మాట్లాడుతూ కార్యక్రమం నిర్బంధ కాదని, ఐచ్ఛికమేనని తెలిపారు. ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు.రాజశేఖర్‌రావు, డీకే సుబ్బారెడ్డి, ఎండీ ఖలీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమలేష్, ఎం.కళాధర్, డి.పెదబాబు, బాలాజీ, వై.శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'పెట్రో' రవాణాలో నిబంధనలు పాటించాలి

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: పెట్రోలియం ఉత్పత్తుల రవాణాలో చట్టబద్ధ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకు యజమానులు, గ్యాస్ డీలర్లతో సమావేశమయ్యారు. పెట్రోలియం ఉత్పత్తులు రోడ్డు ద్వారా సురక్షితంగా రవాణా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్‌పీజీ సహజ వాయువు సురక్షితమైన రోడ్డు రవాణాకు నియమాలు తప్పని సరిగా పాటించాలని తెలిపారు. పెట్రోలియం సంస్థలు ఎక్కువ దూరాలకు రోడ్డు రవాణాను తగ్గించి ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను పరిశీలించాలని సూచించారు. అత్యంత రద్దీ ప్రాంతాలను దాటే సమయంలో ప్రజా భద్రతను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఎక్కువ దూరం రవాణా చేసే సమయంలో డ్రైవర్‌తో పాటు ప్రత్యామ్నాయ డ్రైవర్‌ను ఏర్పాటుచేసుకోవాలన్నారు. డ్రైవర్ల వైద్య ఫిట్‌నెస్ పత్రాలను ప్రయాణం ప్రారంభించే ముందు తటస్థంగా పరీక్షించాలని తెలిపారు. లోడ్ అన్‌లోడ్ సమయంలో ట్రక్ డ్రైవర్లు విశ్రాంతికి సమయం కల్పించేలా సంస్థలు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

– జిల్లాలో 35 బ్లాక్ స్పాట్లును గుర్తించామని, ఆ ప్రదేశాల్లో సురక్షిత చర్యలను అమలు చేయాలని తెలిపారు. పెట్రోల్‌బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీల వద్ద రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల విషయంపై అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బీపీసీ, ఐఓసీఎల్, లీగల్ మెట్రాలజీ విభాగాల అధికారులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, పెట్రోల్ బంకుల డీలర్లు హాజరయ్యారు. అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ సీహెచ్ లోకనాథ, ఏఎంవీఐ ఎంఎల్ వంశీకృష్ణ, బీపీసీ జిల్లా సేల్స్ ఆఫీసర్ చంద్రకాంత్ నాయక్, ఐఓసీఎల్ జిల్లా సేల్స్ ఆఫీసర్ సాయి ప్రకాష్, లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల్లో స్వచ్ఛత

జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు


తుమ్మలపాలెంలో సుప్రీం ఎల్‌టీసీలో నాడెప్ యూనిట్లను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డీపీఓ నాగసాయికుమార్ తదితరులు

ప్రత్తిపాడు: ప్రజల సహకారంతోనే గ్రామాల్లో స్వచ్ఛత సాధ్యపడుతుందని జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని సుప్రీం ఎల్‌టీసీలో బుధవారం హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు గుంటూరు జిల్లాలోని 17 మండలాల ఎంపీడీవోలు, డెప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. వారు ఆరు బృందాలుగా క్లాప్ మిత్రలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త సేకరణ విధానాలపై ఆరా తీశారు. మహిళలతో మాట్లాడారు. వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ లక్ష్యాలను అనంతరం రచ్చబండ సెంటరులో ప్రజలకు వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యాండ్ వాష్ చేయించారు. తదనంతరం గ్రామంలోని సుప్రీం ఎల్‌టీసీని సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామాల స్వచ్ఛతపై యంత్రాంగం పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్ మాట్లాడుతూ తుమ్మలపాలెం పంచాయతీలో జరుగుతున్న అన్ని రకాల స్వచ్ఛతా కార్యక్రమాలు జిల్లాలోని అన్ని మండలాల్లో జరిగేలా ఎంపీడీవోలు, డెప్యూటీ ఎంపీడీవోలు చూడాలన్నారు. గుంటూరు డీఎల్‌పీవో శ్రీనివాసరావు గ్రామంలో విజయవంతంగా స్వచ్ఛతను అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి, కార్యదర్శి షేక్ ఖాజా, క్లాప్ మిత్రులను సత్కరించారు. ఎంపీడీవోలు, డెప్యూటీ ఎంపీడీవోలు, డీపీఆర్‌సి ప్రతినిధులు నిరంజన్, కరీముద్దిన్, అనురాధ, ఐటీసీ ఫినిష్ సొసైటీ కో–ఆర్డినేటర్ యశ్వంత్ శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అక్రమ కేసుతో ఎంపీపీని వేధించడం దారుణం

యాదవ యువజన రాష్ట్ర అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడటం దారుణమని ఆంధ్రప్రదేశ్ యాదవ యువత రాష్ట్ర అధ్యక్షులు పొన్నూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ ఆరోపించారు. పెదకాకాని మండల పరిషత్ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తుల్లిమిల్లి శ్రీనివాసరావుపై అక్రమ కేసుతో ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వ చర్యలను ఖండించారు. ఎంపీపీ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా జలకళ ద్వారా మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే అక్రమంగా కేసు పెట్టి వేధిస్తున్నట్లు స్పష్టమవుతోందని వెల్లడించారు. అధికారులపై ఎలాంటి చర్యలు లేకుండా శ్రీనివాసరావుని మాత్రమే బాధ్యుడిని చేయడం దారుణమన్నారు. రాజకీయంగా అణచివేసే పన్నాగంలో భాగంగా బలహీన వర్గాలను టార్గెట్ చేసి వేధింపులకు గురిచేయడం హేయమైన చర్య అన్నారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే యాదవ కులానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలోని యాదవులంతా ఒక్కటై కూటమిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో ఎంపీపీపై పెట్టిన అక్రమ కేసును తీసివేసే వరకూ ఉద్యమిస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జ్వరంతో 'నారాయణ' విద్యార్థి మృతి

- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు



లక్ష్మీపురం: నారాయణ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థి జ్వరంతో బుధవారం మృతి చెందాడు. వివరాలు.. ప్రకాశం జిల్లా, కొమరోలు మండలం, బోనపల్లె గ్రామానికి చెందిన ఏలూరి వెంకట సుబ్బయ్య, సువర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వెంకట నారాయణ(15), రెండో కుమారుడు దీక్షిత్‌లు గుంటూరులోని నారాయణ విద్యాసంస్థలో చదువుతున్నారు. వెంకట నారాయణ పలకలూరు క్యాంపస్‌లో పదో తరగతి, దీక్షిత్ పట్టాభిపురం ఐఐటీ క్యాంపస్‌లో పదో తరగతి చదువుతున్నారు. ఇద్దరు హాస్టల్‌లోనే ఉంటున్నారు. వెంకట నారాయణ వారం రోజుల నుంచి జ్వరంతో ఉండటంతో ఈ నెల 2వ తేదీన తల్లిదండ్రులు వచ్చి స్వగ్రామానికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. సోమవారం పలకలూరులోని క్యాంపస్‌లో దిగబెట్టి వెళ్లారు. జ్వరం మళ్లీ రావడంతో మంగళవారం రాత్రి గుంటూరు గుజ్జనగుండ్లలో ఉండే మేనమామ మహేష్‌కు ఫోన్ చేయడంతో బుధవారం ఉదయం సుమారు 6.30 గంటలకు క్యాంపస్‌కు వచ్చి బాలుడిని గుజ్జనగుండ్లలోని తన సోదరి అనసూయ ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత స్థంభాలగరువులోని ఎంజీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేస్తున్న సమయంలో వెంకట నారాయణ మృతి చెందాడు. మధ్యాహ్నం సుమారు 2.20 గంటల సమయంలో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వచ్చి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో జోరువానలోనూ స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆస్పత్రికి చేరుకుని విద్యార్థి కుటుంబానికి అండగా నిలిచారు.

14 మంది బాల కార్మికులు గుర్తింపు

నెహ్రూనగర్: బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎం.బాలు నాయక్‌తో కలిసి బుధవారం చిలకలూరిపేట రోడ్డులో మిర్చి గ్రేడింగ్ చేసే పాయింట్‌లో తనిఖీలు నిర్వహించారు. పని చేస్తున్న 14 మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ యజమానులకు 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు జైలు శిక్షతోపాటు రూ.20 వేల నుంచి రూ. 50 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ముగ్గురు యజమానులపై కేసులు నమోదు కోర్టులో ప్రవేశపెట్టామన్నారు. బాలలతో ఎక్కడైనా పని చేయిస్తున్నట్లు గుర్తిస్తే 94925 55144 ఫోను నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.గాయత్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

మంగళగిరి టౌన్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపు పాలు పట్టించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్ బాబు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిచేసిన గూండాలను అరెస్ట్ చేయాలి

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సింగరయ్య యాదవ్



దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్‌పై దాడి చేసి గాయపరిచిన టీడీపీ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాల సింగరయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని బుధవారం ఆయన తీవ్రంగా ఖండించారు. కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండపల్లి గ్రామంలో కారులో ప్రయాణిస్తుంటే, కారును అడ్డగించి, కారు అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న రమేష్ యాదవ్‌పై తెలుగుదేశం పార్టీ గూండాలు, కార్యకర్తలు తీవ్రంగా దాడి చేసి గాయపరిచారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేయటం, అక్రమ కేసులు పెట్టడం లక్ష్యంగా పరిపాలన కొనసాగుతుందని మండిపడ్డారు. ఈ దాడి రమేష్ యాదవ్ మీద జరిగిన దాడి మాత్రమే కాదని, రాష్ట్రంలోని మొత్తం బడుగు, బలహీన వర్గాల మీద జరిగిన దాడి అని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, కేవలం నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రమే నడుస్తుందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఈ దాడికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్రైస్తవులపై అక్రమ కేసుల ఎత్తివేతకు డిమాండ్

నగరంలో క్రైస్తవ సంఘాల భారీ శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీలో గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య, క్రైస్తవులు

నెహ్రూనగర్: చత్తీస్‌గడ్‌లో ఇద్దరు నన్‌లను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిపై అక్రమ కేసులను ఎత్తివేయాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు క్రైస్తవ, దళిత, బహుజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడుల పేరుతో సిస్టర్లను అన్యాయంగా అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇలాంటి దాడులపై ఐక్యంగా ఉంటూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బలవంతపు మత మార్పిడి ఎవరూ చేయరని, సమాజంలో అట్టడుగువర్గాల అభివృద్ధికి క్రైస్తవ మతం కృషి చేస్తుందన్నారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జె విద్యాసాగర్ మాట్లాడుతూ దేశంలో దశాబ్దాలుగా క్రైస్తవులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వారు కూడా భారతీయులేనని గ్రహించలేని స్థితిలో మతోన్మాదులు ఉన్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు గాబ్రియేల్, సహదేవ్, నెహెమ్యా, మార్కు, బాబురావు, సతీష్‌కుమార్, కిరణ్, రాజు, రేపూడి రాయప్ప, అబ్రహం, విజయ్‌పాల్, వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మద్దు ప్రేమజ్యోతిబాబు, డాక్టర్ కర్రా హనోక్ బెంజిమెన్, రత్నశ్రీ, జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీల పిల్లలకు ప్రత్యేక బోధన

తాడికొండ: రాజధానిలో వలస కూలీల చిన్నారులకు ప్రత్యేక వసతులతో కూడిన బోధన అందించనున్నట్లు తుళ్ళూరు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆర్‌వీఆర్ నిర్మాణ కంపెనీలో పర్యటించిన ఆయన 10 మంది చిన్నారులను గుర్తించి, అయ్యన్నచెరువులోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కూలీ భాష, అవసరాన్ని బట్టి సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసి ప్రత్యేక విద్య అందించనున్నట్లు తెలిపారు. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, చత్తీస్‌గడ్ నుంచి కూలీలు వచ్చారని పేర్కొన్నారు. సీఆర్‌డీఏ ఏడీసీఎల్ మార్స్ పీఆర్ఏ పుల్లయ్య పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులను బలి చేయొద్దు



ధర్నాలో పాల్గొన్న వి.కృష్ణయ్య తదితరులు

ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు

కొరిటెపాడు(గుంటూరు): పొగాకు రైతులను బలి చేయొద్దని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మొత్తం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. సంఘాల ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్‌లోని వ్యవసాయ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీతో పొగాకు కొనుగోలు ఆపేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన విరమించుకోవాలని పేర్కొన్నారు. 20 శాతం మాత్రమే కొన్నారని తెలిపారు. మిగతాదీ కొనకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ధర కూడా తగినంత ఇవ్వడం లేదని చెప్పారు. నాణ్యత లేదని పొగాకు వెనక్కి పంపుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ కంపెనీలతో కుమ్మక్కై బయ్యర్లు ధర లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ కొనుగోలు చేసిన పొగాకుకు సంబంధిత రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు అందుబాటులో లేకపోవడంతో మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నల్లమడ సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంచుమాటి అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణమూర్తి, నంద్యాల జిల్లా రైతు నాయకులు వెంకటేశ్వర గౌడ్, రైతు సంఘాల నాయకులు కొల్లి రంగారెడ్డి, పాడిబండ్ల కోటేశ్వరరావు, బండి శంకరయ్య, బిక్కి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి బీసీలంటే అంత అలుసా?

- కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీలను భయభ్రాంతులకు గురి చేయడానికే హత్యాయత్నాలు, అక్రమ అరెస్టులు
- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌యాదవ్


ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి నివాసంలో మాట్లాడుతున్న నాయకులు

పెదకాకాని: కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. పెదకాకానిలోని రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి నివాసంలో బుధవారం మండల ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలే పార్టీకి వెన్నుముక అని ప్రచారం చేసే కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుందన్నారు. మూడు సంవత్సరాల కిందట జరిగిన జలకళ పథకంలో అక్రమాలు జరిగాయని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావుకు గిట్టని వారితో ఫిర్యాదు చేయించి అరెస్టు చేయించడం ముమ్మాటికీ రాజకీయకక్షే అన్నారు. ఈనెల 3వ తేదీన ఓ దినపత్రికలో సీనియర్ ఎమ్మెల్యేపై ఆ ఎమ్మెల్యే దందాలతో దడ అని ప్రచురణ కావడంతో సీనియర్ ఎమ్మెల్యే ఎవరబ్బా అని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు సందిగ్ధంలో ఉన్నారన్నారు. అదే సమయంలో ఆ ఎమ్మెల్యే ఎవరో ఆ పార్టీ నాయకులే విలేకరుల సమావేశం పెట్టడం, అదే పత్రికతో పాటు పలు పేపర్లలో ఈనెల 5వ తేదీన తక్కెళ్ళపాడు కల్యాణ మండపం వ్యవహారంలో ఎమ్మెల్యే నరేంద్ర తప్పేంలేదని ప్రచురించడం చూస్తే ఆ సీనియర్ ఎమ్మెల్యే ఎవరో సమాజానికి స్పష్టంగా తెలియజేశారన్నారు. ఈ వ్యవహారంపై ప్రజల ఆలోచన, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చను ప్రక్కదారి పట్టించడానికే కూటమి ప్రభుత్వం ఎంపీపీని ఒక పథకం ప్రకారం అరెస్టు చేయించిందన్నారు. గతంలో అనుమర్లపూడిలో జరిగిన సంఘటన రోజు నుంచి ఎంపీపీపై ఎమ్మెల్యే కక్ష పెంచుకున్నాడని ఆరోపించారు. కేవలం రాజకీయకక్షతోనే ఎంపీపీని అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. ఇటీవల కాలంలో పొన్నూరు రూరల్ మండలం, మన్నవ గ్రామ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావును కూడా రాజకీయ కక్షతో హత మార్చేందుకు ఎమ్మెల్యే అండదండలతో హత్యాయత్నం చేశారన్నారు. ప్రభుత్వం ఒక పథకం ప్రకారం వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లయదుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా టీబీ కార్యాలయం పరిధిలో పలు పోస్టులను భర్తీ చేసేందుకు 2024 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్నవారి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను బుధవారం విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆధారాలతో లిఖిత పూర్వకంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. లిస్ట్‌ను గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 2,000

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	50,597
అమ్మకాలు	49,084
నిల్వ	10,027

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,200
341	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,300
341	10,000-14,800
4848	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,200
దేవనూరు డీలక్స్	10,000 - 12,300
తాలు	5,300 - 7,000

–కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 676

కొమ్ములు : 506 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,700	10,600	10,100

కాయలు : 170 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,800	10,600	10,200

మొత్తం అమ్మకాలు : 507.00 క్వింటాళ్లు